క్లుప్తంగా

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కోసం పాస్‌లు నిలిపివేత

పట్నంబజారు: గుంటూరు ఆర్టీసీ డిపో–2 పరిధిలో బస్సు పాస్ తీసుకునే విద్యార్థులకు ఈనెల 12, 13 తేదీల్లో పాస్‌లు ఇవ్వడం లేదని ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కోసం బస్సు పాస్‌లు ఇవ్వడం రెండురోజులు నిలిపివేసినట్లు వివరించారు. తిరిగి 14వ తేదీన యథావిధిగా ఆన్‌లైన్‌లో బస్సు పాస్‌లు ఎంట్రీ చేసుకోవచ్చన్నారు. దీంతోపాటు ఆర్టీసీ బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్‌లో కూడా పాస్‌లు తీసుకోవచ్చని తెలిపారు.

నేటి నుంచి శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: మల్లారెడ్డినగర్ విఘ్నేశ్వర స్వామి సహిత ధర్మశాస్త అయ్యప్ప స్వామి, విద్యా సరస్వతి, పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వార్ల దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఏంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 12 ఉదయం మహా గణపతి అభిషేకం, హోమం, 13న పర్వతవర్ధిని, మాలికాపురోత్తమ్మ అభిషేకం, సాయంత్రం విశేష హోమాలు, 14 మహాలింగేశ్వరునికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తామని అన్నారు. 15న విద్యా సరస్వతి, సుబ్రహ్మణ్య విశేష అభిషేకాలు, హోమాలు, 16న శివపార్వతుల శాంతి కల్యాణం, సాయంత్రం స్వామి శోభాయాత్ర, అయ్యప్ప పడిపూజ వైభవంగా కొనసాగుతుందని చెప్పారు.

పని దినాన్ని 8 గంటలుగా కొనసాగించాలి

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల సవరణ బిల్లు– 2025 కింద రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడాన్ని ఏఐటీయూసీ వ్యతిరేకిస్తుందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కోటా మాల్యాద్రి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ ఒకటో శానిటరీ డివిజన్ వద్ద పని దినాన్ని రోజుకు 8 గంటల నుంచి 10 గంటలకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల చట్టం– 1948ను సవరణ చేసి అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎనిమిది గంటలను 10 గంటలుగా మార్చడం అంటే కార్మికులను, కార్మిక పోరాటాలను అవమానించడమేనని అన్నారు. కార్యక్రమంలో బుజ్జి, యేసు రత్నం, మరియమ్మ, నాగేంద్ర, రూతు, కామాక్షి, వీరమ్మ పాల్గొన్నారు.

ఆచార్య అల్లంకు సాంబయ్య స్మారక పురస్కారం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం విద్యాప్రదాత సాంబయ్య వర్ధంతి, ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్ వార్షికోత్సవం నిర్వహించారు. ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్, సిహెచ్.సాంబయ్య స్మారక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆలయ పాలకమండలి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్.భాస్కరరావు అధ్యక్షత వహించారు. అనంతరం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావుకు సిహెచ్.సాంబయ్య స్మారక పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో ఐ.ఆర్.టి.ఎస్.సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ ఎం.దినేష్‌కుమార్, ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య హరిబాబు, జీఎస్టీ అధికారి ఎన్.శ్రీనివాసరావు, నాటక రచయిత కావూరి సత్యనారాయణ, సి.చైతన్య ప్రసంగించారు. అనంతరం లేఖ్యా భరణి బృందం కూచిపూడి నృత్యం, పూజిత, అర్చనలు భరత నాట్యాన్ని ప్రదర్శించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక ఎస్‌వీఎస్‌కాలనీలోని శ్రీపద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం సేవా సమితిలో బుధవారం 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రాత్రి విష్వక్సేన పూజ, పుణ్యాహం అజస్రదీపారాధన, దీక్షాధారణ, రుత్విగ్వరణ, మేదినీ పూజలు చేశారు. అనంతరం అంకురారోపణ, ధ్వజారోహణం, నీరాజనం, మంత్ర పుష్పం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. సీనియర్ వైద్యులు మద్దినేని గోపాలకృష్ణ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించగా, ఆలయ నిర్వాహకులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

త్వరలో స్ట్రీట్ వెండింగ్ జోన్‌లు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలోని వీధి వ్యాపారుల సంక్షేమానికి నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని, వెండింగ్ కమిటీ ద్వారా త్వరలో నగరంలో స్ట్రీట్ వెండింగ్ జోన్‌ల గుర్తించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగర కమిషనర్ చైర్మన్‌గా స్ట్రీట్ వెండింగ్ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెండింగ్ కమిటీ గురువారం నుంచి నగరంలో వీధి వ్యాపారుల కోసం గ్రీన్, ఎల్లో, రెడ్ జోన్‌ల ఏర్పాటుకు పరిశీలించనున్నట్లు వివరించారు. ఇప్పటికే సచివాలయ కార్యదర్శుల ద్వారా వీధి వ్యాపారుల సమగ్ర సర్వే జరుగుతుందని, వారం రోజుల్లో జోన్‌ల ఏర్పాట్లపై కమిటీ సూచనల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. వెండింగ్ కమిటీలో వీధి వ్యాపారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉన్నారని, అందరికి ఆమోదయోగ్యంగా ప్రాంతాలను జోన్‌లుగా ఏర్పాటు చేస్తామన్నారు. వెండింగ్ జోన్‌లకు అవసరమైన ప్రాంతాలలో అంగీకారం తెలిపిన ప్రైవేట్ స్థలాలను కూడా అద్దె ప్రాతిపదికన తీసుకుంటామని చెప్పారు. వార్డు సచివాలయాల వారీగా స్ట్రీట్ వెండర్ల సర్వే జరుగుతుందని, ఇంకా ఎవరైనా సర్వేలో కవర్ కాకుంటే సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వర రావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, పీఓ రామారావు, వెండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు బొద్దుపల్లి స్మిత పద్మజ, ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

నూతన క్రైస్తవ సమాధి తోటలు ఏర్పాటు చేయాలి

నెహ్రూనగర్: నగరంలో నూతన క్రైస్తవ సమాధి తోటలు ఏర్పాటు చేయాలని క్రైస్తవ సంఘాల నాయకులు విన్నవించారు. బుధవారం తూర్పు నియోజకవర్గంలోని మంత్రి వారి వీధిలో, పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం వచ్చిన గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్రనాథ్, గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ని ఆలిండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందర బాబు, ఏఈఎల్‌సీ, వెస్ట్ పారిస్ చర్చ్ నాయకులు రవికాంత్, దళిత హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఎం.ప్రేమ జ్యోతి బాబు, జకిన్ ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు పేరు పోగు సురేష్ జేమ్స్ కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజసుందర బాబు మాట్లాడుతూ 200 సంవత్సరాల క్రితం క్రైస్తవ మిషనరీలు గుంటూరు నగరంలో ఏర్పాటు చేసిన క్రైస్తవ సమాధి తోటలు, పూర్తిగా సమాధులతో నిండిపోయి అంగుళం భూమి కూడా దొరక్క ఒకే సమాధిలో నాలుగు మృతదేహాలను పెట్టే విధానం జరుగుతున్నదన్నారు. 2013లో గోరంట్లలో అప్పటి జిల్లా కలెక్టర్ సురేష్ ఏర్పాటు చేసిన, సమాధి తోట ఇంతవరకు క్రైస్తవులకు అందుబాటులోకి రాలేదని చెప్పారు. పొత్తూరు వద్ద కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమాధి తోట క్రైస్తవులకు అందుబాటులోకి రాలేదన్నారు.



మేయర్ రవీంద్రకు, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ ఇంజనీర్, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బి.శ్రీనివాసరావు, బి.రాజమోహన్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. నల్లచెరువు పరిధిలో డీ–2 సెక్షన్‌లోని సంపత్ నగర్, ఎత్తురోడ్, నల్లచెరువులోని అన్ని లైన్లు, మూడు బొమ్మల సెంటర్, ఎన్‌హెచ్–5 తదితర ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పట్నంబజారు: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ ఎం.వీరయ్య చౌదరి సూచించారు. నాజ్‌సెంటర్‌లోని ఫ్యాన్సీ కల్యాణమండపంలో బుధవారం కొత్తపేట పీఎస్ పరిధిలోని ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఎస్పీ అజీజ్, ఎస్‌హెచ్ఓ వీరయ్య చౌదరి మాట్లాడుతూ అనవసరమైన లింకులు ఓపెన్ చేయడం, వెబ్‌సైట్‌లలోని లింక్‌లు ఓపెన్ చేయడం ద్వారా సైబర్ నేరాలకు గురవుతారన్నారు. దీంతో పాటు, బ్యాంకు ఖాతాలకు సంబంధించి ఎవరూ ఫోన్ చేసినా, వ్యక్తిగత సమాచారం అడిగినా తక్షణమే ఆయా శాఖల అధికారులను సంప్రదించాలన్నారు. అప్రమత్తంగా ఉండటంతోనే సైబర్ నేరాల పాలు కాకుండా ఉండవచ్చని స్పష్టం చేశారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా వంశీకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏబీవీపీ గుంటూరు జిల్లా కన్వీనర్‌గా మానం వంశీకృష్ణ నియమితులయ్యారు. ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు అనంతపురంలో జరిగిన ఏబీవీపీ ప్రాంత అభ్యాసవర్గలో భాగంగా గుంటూరుజిల్లా కన్వీనర్‌గా నియమితులైన వంశీకృష్ణ గతంలో టీజేపీఎస్ కళాశాల ఏబీవీపీ కార్యదర్శిగా, విభాగ్ కార్యాలయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. అదే విధంగా ఏబీవీపీ జిల్లా ఘటన కార్యదర్శిగా గురువెల్లి సాయి బాధ్యతలు చేపట్టారు. సాయి గతంలో ఏబీవీపీలో వివిధ బాధ్యతలు నిర్వర్తించారు.



మానం వంశీకృష్ణ



గురువెల్లి సాయి

ప్రజా హృదయాల్లో సినీ సంగీతానికి ప్రత్యేక స్థానం

లక్ష్మీపురం: ప్రజా హృదయాల్లో తరగని ఆదరాభిమానానికి మారుపేరుగా సినీ సంగీతం ప్రత్యేక స్థానం సంపాదించడంలో సందేహం లేదని ప్రముఖ రంగ స్థల నటులు, ఇంజినీర్ పి.ఘనశ్యామాచార్యులు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పాడుదాం రండి బృందం ఆధ్వర్యంలో బుధవారం సినిమా పాటలు నాడు– నేడు అన్న అంశంపై చర్చ నిర్వహించారు. సీనియర్ గాయని యార్లగడ్డ లక్ష్మి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ నాటి సినిమాల్లో పాటల్లో సామాజిక ప్రయోజనాలుండేవి, ప్రజల్ని చైతన్య వంతుల్ని చేసేవని గుర్తు చేశారు. యువతకు మాత్రమే స్ఫూర్తి నిస్తున్నాయని కొన్ని పాటలైతే కాలక్షేపం కోసం వినేలా మాత్రమే ఉన్నాయని అన్నారు. అనంతరం పాడుదాం రండి బృందం పాడిన గేయాలు అందరిని అలరించాయి.



మాట్లాడుతున్న ప్రముఖ రంగ స్థల నటుడు ఘనశ్యామాచార్యులు

వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో వసంతోత్సవం



నగరంపాలెం: స్థానిక లాలాపేటలోని పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వసంతోత్సవం చక్రస్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి ధ్వజ అవరోహణ చేపట్టారు. భక్తులు స్వామిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమాలను దేవస్థాన ఈఓ టి.సుభద్ర పర్యవేక్షించారు.

అవకతవకలను విచారించాకే రికవరీ

ప్రత్తిపాడు: స్త్రీనిధి రుణాల మంజూరు, చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిగిన తరువాతనే రికవరీ గురించి ఆలోచిస్తామని.. అప్పటి వరకు మేం చేయగలిగింది ఏమీ లేదని వెలుగు ఏపీఎం వి.లాజరు స్త్రీ నిధి ఏజీఎంకు తేల్చి చెప్పారు. ప్రత్తిపాడు వెలుగు కార్యాలయంలో బుధవారం స్త్రీనిధి రుణాల రికవరీపై వీవోఏలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్త్రీనిధి ఏజీఎం ఎస్.హర్షవర్ధన్ వీవోల వారీగా స్త్రీనిధి రుణాలు, బకాయిలు, చెల్లింపులపై సమీక్ష నిర్వహించారు. అదే సమయంలో ప్రత్తిపాడు వీవోఏను రికవరీపై ఏజీఎం ప్రశ్నించారు. రుణాలు తీసుకున్న వారు వాయిదాలు ఎందుకు చెల్లించడం లేదని.. రికవరీలు లేకుంటే మిగిలిన సభ్యులకు రుణాలు ఎలా ఇస్తామని ప్రశ్నించారు. దీంతో స్పందించిన ఏపీఎం లాజరు ప్రత్తిపాడులోని ఓ గ్రామ సంఘంలో ఒక గ్రూపు పేరుతో రూ.4.5 లక్షలు స్త్రీనిధి రుణం తీసుకున్నారని.. కానీ ఆ రుణమొత్తం గ్రూపు సభ్యులకు చేరలేదన్నారు. వీటన్నింటికీ సంబంధించిన ఆధారాలు రికార్డులతో సహా ఉన్నాయన్నారు. స్త్రీనిధి అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ చేయిస్తానని పీడీ చెప్పారని, విచారణ జరిగే వరకు రికవరీ విషయంలో మేమేమీ చేసేది లేదని స్పష్టం చేశారు. స్పందించిన ఏజీఎం హర్షవర్ధన్ మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడిన వీవోఏపై పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయాలని, అదే విధంగా వారి నుంచి డబ్బులు రికవరీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్తిపాడు నియోజకవర్గ స్త్రీనిధి మేనేజర్ ఆనంద్, సీసీలు, మండల సమాఖ్య ఓబీలు, వీవోఏలు పాల్గొన్నారు.



అవకతవకల ఫైల్‌ను ఏజీఎంకు చూపిస్తున్న ఏపీఎం లాజరు

తప్పిన పెను ప్రమాదం



జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. కొండపల్లి ఓఎన్‌జీసీ నుంచి చిలకలూరిపేట వైపు గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న లారీ బుధవారం ఉదయం అదుపుతప్పింది. ప్రత్తిపాడు మండలం నడింపాలెం 16వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న అండర్ పాస్ బ్రిడ్జి గోడను లారీ ఢీకొట్టింది. దీంతో లారీ అదుపు కాక గోడపైకి దూసుకెళ్లింది. లారీలోని సిలెండర్లు ఖాళీవి కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఒక్కసారిగా లారీ గోడపైకి దూసుకురావడంతో బ్రిడ్జి కింద సర్వీసు రోడ్డులో ఉన్న ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఎక్కడ కింద పడుతుందో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని పరుగులు పెట్టారు. ప్రమాదంలో లారీ ముందు భాగం బాగా దెబ్బతింది.

– ప్రత్తిపాడు

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రత్తిపాడు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రత్తిపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన నియోజకవర్గ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా ఆటోలో రేషన్ బియ్యంను ప్రత్తిపాడు మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. స్థానిక వేణుగోపాల స్వామి గుడి వద్ద రేషన్ బియ్యంతో ఉన్న వాహనాన్ని మంగళవారం రాత్రి పోలీసులు గుర్తించారు. కానీ పోలీసులు వాహనాన్ని స్టేషనుకు తరలించలేదు. ఏం జరిగిందో ఏమో గానీ.. తిరిగి అర్ధరాత్రి తరువాత వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు రప్పించి కేసు నమోదు చేశారు. ఆటోలో ఇరవై బస్తాల రేషన్ బియ్యం దొరకడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా పోలీసులు తొలుత వాహనాన్ని గుర్తించిన సమయంలో ఆటో నిండా రేషన్ బియ్యం బస్తాలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే ఉపేక్షించం

చేబ్రోలు: విద్యుత్ సర్వీసుల తనిఖీలు విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయని విద్యుత్‌శాఖ విజిలెన్స్ విభాగ పర్యవేక్షక ఇంజినీర్ బి.విజయకృష్ణ అన్నారు. చేబ్రోలు సెక్షన్ పరిధిలోని గుండవరం, గొడవర్రు, మంచాల, తోట్లపాలెం, ఉప్పరపాలెం, శేకూరు, శేకూరుపాలెం, వడ్లమూడి గ్రామ పరిధిలోని విద్యుత్ శాఖాధికారుల బృందం బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 62 మంది అధికారులు, 186 మంది సిబ్బంది, 62 మంది బృందాలుగా ఏర్పడి 4,329 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ చట్టానికి వ్యతిరేకంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారికి మొత్తంగా రూ.4.22 లక్షల అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. భారత విద్యుత్ చట్టం 135 ప్రకారం పనిచేయని మీటరు నుంచి విద్యుత్ వాడుకున్నా.. ఉండాల్సిన మీటరుకు బదులు వేరే మీటరు పెట్టి సీలు వేయకపోయినా ఉపేక్షించమని, అపరాధ రుసుం విధించనున్నట్లు తెలిపారు. తనిఖీలలో డీఈఈ ఎన్.మల్లికార్జున ప్రసాద్, డీఈఈ బి.అశోక్ కుమార్, ఏఈలు కె.కోటేశ్వరరావు, యు.శివశంకర్, స్థానిక ఏఈ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏపీ ప్రజా నాటక కళాపరిషత్ కార్యాలయం ప్రారంభం

తాడేపల్లి రూరల్: ప్రాతూరులోని ఆంధ్రప్రదేశ్ నాటక కళాపరిషత్ నూతన కార్యాలయాన్ని ఏపీ నాటక కళాపరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ కార్యాలయాన్ని ప్రాతూరులో ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. ప్రాతూరులో ఆఫీసును ఏర్పాటు చేసిన శ్రీనివాస్, ప్రసాద్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కళాకారులందరినీ కలుపుకొని పనిచేస్తూ నాటక కళను అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ ప్రాతూరు గ్రామ పార్టీ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాస్, కె.ప్రసాదు, పి.నాగేశ్వరరావు, కె.సత్యనారాయణ, సాంబశివరావు, హరిబాబు, నరసింహారావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

14,15 తేదీల్లో విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు

లక్ష్మీపురం: యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 11వ రాష్ట్ర మహాసభలు ఈనెల 14,15 తేదీలలో గుంటూరులో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ నగర కార్యాలయంలో బుధవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంస్థ పరిరక్షణ కోసం మహాసభల్లో ప్రధాన చర్చ ఉంటుందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల వాటి నిర్వహణ షిరిడి సాయి వంటి ప్రైవేటు సంస్థలకు అప్పగించటం వాటి నిర్వహణలో పెద్ద ఎత్తున లోపాలు ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటికే ఉద్యోగులకు మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం ప్రధానమైన చర్చ జరుగుతుందని వివరించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రివర్స్ అమలు జరిపి ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. జేఎల్ఎం గ్రేడ్– 2 లను గాంధీ జయంతి రోజు ఉద్యోగులుగా తీసుకొని నేటికీ వారిని గాలిలో దీపం లాగా ఉంచారన్నారు. మహాసభలను ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కోశాధికారి ఎస్.రాజేందర్ ప్రారంభించనున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.వేణు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూఈఈయూ రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు, వెంకటేశ్వరరావు

ఏడాది పాలనపై శ్వేత పత్రం విడుదల చేయాలి

సీపీఐ నాయకుడు అజయ్ కుమార్

లక్ష్మీపురం: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏడాది పరిపాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కొత్తపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన ఏడాది కాలంలో పేదలకు ఇళ్ల స్థలాలు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేస్తానని చెప్పి సంవత్సరం గడుస్తున్న ఇచ్చే ప్రయత్నం కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఎప్పుడు ఇస్తారో సమాధానం చెప్పాలని కోరారు. గిట్టుబాటు ధర లభించక రైతులు, కౌలు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో బీసీ మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని, అన్ని వర్గాల మహిళలకు సంవత్సరానికి రూ.15,000 ఇస్తానని చెప్పి, అలాగే మహిళలకు ఉచిత బస్సు పథకం మహిళలను ఊరిస్తూ ఏ పథకాలు ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపారని, ఉద్యోగాలు లేక యువత తీవ్ర స్థాయిలో అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడారు. సమావేశంలో నాయకులు పచ్చల శివాజీ, ఆకిటి అరుణ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల

ఉద్యోగ సాధనలో ప్రతిభ, నైపుణ్యాలు ఎంతో కీలకం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ సాధనలో ప్రతిభతో పాటు నైపుణ్యాలు ఎంతో కీలకమని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ అన్నారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో 2023–25 ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ బ్యాచ్‌కు చెందిన 35 మంది విద్యార్థులు వివిధ ప్రముఖ సంస్థలు, ఆస్పత్రుల్లో ఉద్యోగాలు పొందిన సందర్భంగా వృత్తిలో రాణించడం ఎలా అనే అంశంపై అవగాహన కల్పించారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ పాఠ్యాంశాలతో పాటు ఉద్యోగాలను సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలను కల్పించడం ద్వారా విద్యార్థులను పరిశ్రమలకు దీటుగా తయారు చేస్తున్నామని తెలిపారు. ప్లేస్‌మెంట్ అధికారి చల్లా వైష్ణవి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థుల్లోని ప్రతిభ, ఆత్మ విశ్వాసం, నైపుణ్యాలను పరిశీలించిన ఆయా సంస్థలు, కంపెనీలు ఉద్యోగాలకు ఎంపిక చేశారని చెప్పారు. ప్లేస్‌మెంట్ సెల్ నిరంతరం విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కల్పించి, కార్పొరేట్ ప్రపంచంలో పోటీకి సిద్ధం చేసే విధంగా మార్గదర్శనం అందిస్తోందన్నారు. ఈసందర్భంగా వివిధ కార్పొరేట్ కంపెనీల్లో ప్రతి విద్యార్థి రూ.3.50 లక్షల నుంచి రూ.ఆరు లక్షల వరకూ వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చక్రవర్తి, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు బాజీబాబు, వేదవతి, అనిత, రాజరాజేశ్వరిదేవి, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ఎస్వీ రమణ, చల్లా వైష్ణవి, చక్రవర్తి

యోగాంధ్రలో భాగంగా జిల్లా స్థాయి పోటీలు

గుంటూరు మెడికల్: యోగాంధ్రాలో భాగంగా జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ, యోగాంధ్రా జిల్లా నోడల్ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి బుధవారం తెలిపారు. గుంటూరు నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 12, 13, 14 తేదీల్లో పలు విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇటీవల జరిగిన మండల స్థాయి పోటీల్లో విజేతలు తప్పకుండ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ పోటీలు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని వివరించారు. పోటీలు మూడు రోజులపాటు జరుగుతాయని వెల్లడించారు. వివరాలకు వైద్య అధికారి డాక్టర్ అబూబకర్ 8985606125 సంప్రదించాలని కోరారు.